# ఫుకుషిమా

"మీకు జీవితంలో బాగా ఆనందం కలిగించే విషయం ఏమిటి?"

"మా అమ్మ జ్ఞాపకం..."

"ఆ తరవాత?"

"మా ఊరి మట్టి వాసన..."

"మట్టికి వాసన ఉంటుందా?"

"వాసనే కాదు. మట్టికి మనసు కూడా ఉంటుంది"

"మీరు కవిత్వం రాస్తారా?"

"మంచి తెలుగు మాట్లాడిన వాళ్లంతా కవులు కానక్కర్లేదుగా"

"నిజమే!" ఆమె నవ్వింది. నవ్వినప్పుడల్లా అందంగా రెండు బుగ్గల మీదా సొట్టలు. ముత్యాల్లా మెరిసే పలువరస. జితేంద్రను సమ్మోహనపరుస్తున్నాయి.

"శ్యామల గారూ!"

"చెప్పండి..."

"టోక్యోలో మీరు పరిచయం కాకపోతే నా పరిస్థితి ఘోరంగా ఉండేది..."

"ఎందుకని?"

"తెలుగు వాడికి రాష్ట్రం బయటికి వెళ్తేగాని తల్లి భాష విలువ తెలియదు... జపాన్ వచ్చిన కొత్తలో తెలుగు మాట వినటం కోసం తపించిపోయాను. మీ పరిచయం అయ్యాక ఆ బెంగ తీరిపోయింది"

"మీరు కూడా ఇండియా నుండి ఫుకుషిమా అణు రియాక్టర్‌కే డిప్యుటేషన్ మీద వచ్చారని తెలిసి మొదట ఆశ్చర్యపోయాను. తరవాత చాలా సంతోషం కలిగింది. పైగా మీరు కూడా నాలాగే న్యూక్లియర్ సైంటిస్టు కావడం నాకు మరింత సంతోషం కలిగించింది"

"ఆ విధంగా మనం ఒకే కుటుంబ సభ్యుల్లాంటి వాళ్లం.." ఆమె నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నారు?"

"మీకు బాగా చొరవ ఎక్కువ. పాలలో నీళ్ళలా కలిసిపోతారు"

"మీ అభిప్రాయానికి ధన్యవాదాలు..."

"ఇక డిన్నర్ మొదలెడదాం. వంట అయిపోయింది"

"నాకేం అభ్యంతరం లేదు. నిజానికి నాకు బాగా ఆకలిగా ఉంది. మీరెప్పుడు అన్నం పెడతారా అని ఎదురు చూస్తున్నాను..."

"అరె... ఆ సంగతి ఇందాకే చెప్పొచ్చుగా..."

"ఎలా చెప్పగలను?! మీ దగ్గర నాకు బాగా మొహమాటం..." నవ్వాడు జితేంద్ర.

"ఆహారం, వ్యవహారంలో మొగమాటం కూడదని కదా అంటారు" వడ్డనకు అన్నీ సిద్ధం చేస్తూ అంది శ్యామల.

"మీరు మరీ అంతగా నా మొహమాటాన్ని తీసేస్తే చాలా ప్రమాదం..."

"ఏమిటా ప్రమాదం..."

"నేను ఐ లవ్ యూ అనేశాననుకోండి... అది ప్రమాదమే కదా?" గుండె దడ దడ లాడుతున్నా పైకి బింకంగా అనేశాడు. శ్యామల వడ్డన ఆపి అతనికేసి చూసింది. అతని కళ్లలో బెరుకు చూస్తూ ఆమెకు ఫక్కున నవ్వొచ్చింది.

"ఐ లవ్ యూ అంటే నాకు నచ్చదు..." మందహాసంతో వడ్డన చేస్తూ అంది.

"నేను మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తున్నానంటే?!" ఇంకో అడుగు ముందుకేస్తూ అన్నాడు.

"మీరు తెలుగులో మాట్లాడితేనే బావుంటుంది. మన రాష్ట్రంలో ఎక్కువ మంది ఇంగ్లీషులోనే కదా మాట్లాడతారు? కనీసం దేశం దాటాక అయినా తెలుగులో మాట్లాడక పోతే ఎలా?"

"ఇంతకీ నేను ప్రమాదంలో ఉన్నట్టా లేనట్టా?!"

"ప్రస్తుతం భోజనం చెయ్యకపోతే ప్రమాదంలోనే ఉంటారు. ఆకలి మంటలు బాబూ... ఇవి ఆరని మంటలు బాబూ అంటూ ఆకలి పాటలు పాడుకోవాలి"

"ప్రేమ జ్వాలలు కూడా ఆకలి మంటల్లాంటివేలెండి... ఎంతైనా మీరు గడుసు వారు. ఎక్కడా దొరకరు..."

"గోంగూర వడ్డించనా?"

"టోక్యోలో గోంగూర పచ్చడి తినిపిస్తానంటే అమాంతం మీ పాదాల మీద పడి చకచకా ముద్దులు పెట్టేసుకోవాలనిపిస్తుంది...."

"గోంగూరలో అంత నిషా ఉంటుందా?!" ఆశ్చర్యం నటించింది శ్యామల.

"గోంగూర శబ్దంలోనే నిషా ఉంది. జై ఆంధ్ర మాతా! అర్జంటుగా వడ్డించండి!"

శ్యామల నవ్వుతూ చెమ్చా నిండా గోంగూర పచ్చడి వడ్డించింది.

"మీరు కూడా వడ్డించుకుని కూచోండి. మన సంప్రదాయనికేమీ నష్టం కలగదు"

"అలాగే! మీకు కాదు. నాకూ ఆకలిగానే ఉంది" అంటూ కంచంలో వడ్డించుకుని కూచుంది శ్యామల.

గోంగూర పచ్చడి కలుపుకొని, పప్పు నూనె వడ్డించుకుని తింటూ, తెలుగు వంటకాల ప్రత్యేకతలు చెప్పుకోసాగారు. వేసవి కాలంలో ఆవకాయ అన్నం, మీగడ పెరుగు, పెసర అప్పడాలు, ఉల్లిపాయ వడియాలు.. ఇలా ఒక్కోటీ తలచుకుంటుంటే అవన్నీ ఆస్వాదిస్తున్న అనుభూతి కలిగింది.

"శ్యామల గారూ! మనసుకెంత శక్తి ఉందో చూశారా...తలచుకుంటేనే అనుభవాన్ని అనుభూతి రూపంలో కలిగిస్తోంది"

"అలా కలిగిస్తుంది. కాబట్టే పగటి కలల్లో మునిగిపోతుంటాం" అంది శ్యామల నవ్వుతూ.

అంతలో ఒక్కమాటు ఇల్లంతా తుపానులో ఓడలా ఊగిపోయింది. భోజనాల బల్లమీద నుంచి కంచాలతో సహా పాత్రలన్నీ పడిపోయాయి.

"శ్యామల గారూ! భూకంపంలా ఉంది. జాగ్రత్త..." అంటుండగానే ఆమె వెళ్ళి గోడకు గుద్దుకుంది. తలకు గాయమై నెత్తురు వచ్చింది. జితేంద్ర చప్పున వెళ్లి రుమాలుతో గాయం మీద అదిమి పట్టుకున్నాడు. ప్రకంపనలు తీవ్రంగా ఉన్నాయి. ఆమె నిలబడలేక కూర్చుండి పోయింది. జితేంద్ర కూడా ఆమె పక్కనే కూర్చున్నాడు.

"ఇది మామూలు భూకంపంలా లేదు. అగ్నిపర్వతం పేలటమో, సునామీ విజృంభించటమో జరిగి ఉండాలి..."

"ఇప్పుడేం చేద్దాం? ఇంట్లో ఉంటే ప్రమాదమేమో... బయటికి వెళ్లిపోదామా?" అడిగింది శ్యామల భయంగా చూస్తూ.

"ప్రమాదం ఎక్కడున్నా తప్పదు. మనం ఎనిమిదో అంతస్తులో ఉన్నాం. ఈ పరిస్థితిలో లిఫ్ట్ మనలాంటి జనంతో కిక్కిరిసి ఉంటుంది. మెట్లు కూడా మనుషులతో నిండి ఉంటాయి. మీకు దేవుడి మీద నమ్మకం ఉందా?"

"ఏడుకొండలవాడు మా ఇలవేలుపు"

"మాకూ ఆయనే ఇలవేలుపు! ఆపదమొక్కులవాణ్ని తలచుకోండి... ఆయనే

ఆదుకుంటాడు..." ధైర్యం చెప్పాడు జితేంద్ర.

"జపానులో భూకంపాలు సర్వసాధారణమంటారు. నేను జపాను వచ్చాక ఇదే మొదటి భూకంపం..." అంది శ్యామల.

"బతికి బట్టకట్టి ఆయుర్దాయం గట్టిగా ఉంటే. ఇలాంటివి ఇంకా మరికొన్ని చూడాల్సి ఉంటుంది. భూకంపం కాదు గానీ... మన గోంగూర పచ్చడి ముద్ద కాస్తా నేల పాలయింది. మన అదృష్టం బావుండి కరెంటు ఉంది కాబట్టి. టీవీ పెట్టండి వార్తలు చూద్దాం"

ప్రకంపనలు కాస్త శాంతించడంతో వెళ్లి టీవీ పెట్టింది శ్యామల. జపాన్ ప్రధాని మాట్లాడుతున్నాడు. "ప్రియ దేశ వాసులారా! ప్రస్తుతం మనదేశం మీద సునామీ తీవ్రస్థాయిలో దాడి చేసింది. భూకంపం రిక్టరు స్కేలు మీద తొమ్మిదిగా నమోదైంది. రెండో ప్రపంచ యుద్ధంలో హిరోషిమా, నాగసాకిల మీద అణుబాంబు దాడి తర్వాత, ఇంత పెద్ద విపత్తు వచ్చింది ఈ రోజే.

"ప్రియమైన ప్రజలారా! ఈ విపత్తును మనం ధైర్యంగా ఎదుర్కొందాం. ఇప్పటికే రక్షణ చర్యల కోసం సైన్యం రంగంలోకి దిగింది. ఫుకుషిమా అణువిద్యుత్ కేంద్రంలో ప్రమాద పరిస్థితి ఉంది. ఒక భవనం పేలిపోయింది. వాతావరణం లోకి అణుధార్మికత కలిసే అవకాశం ఉంది. దయచేసి ఎవ్వరూ ఇళ్ల నుంచి బయటికి రావద్దు. ప్రభుత్వం అణు ఆత్యయిక స్థితిని ప్రకటిస్తోంది. మీ రక్షణ గురించి జాగ్రత్తలు తీసుకోండి..."

ప్రధాని ప్రసంగం ముగిశాక, టీవీలో సునామీ బీభత్స దృశ్యాలు ప్రసారం కాసాగాయి. వార్తలు చెబుతున్నారు. శ్యామల, జితేంద్ర ఆసక్తిగా చూస్తున్నారు.

పసిఫిక్ మహాసముద్రంలో భారీ భూకంపం.

'మియాకో సిటీ' మీద సునామీ దాడి. సముద్రం నగరాన్ని ముంచెత్తింది. భవనాలు పేక మేడల్లా కూలిపోతున్నాయి. కార్లు కొట్టుకుపోతున్నాయి. తప్పించుకునే దారిలేక జనం సముద్ర దాడిలో బలిపశువులవుతున్నారు.

ఇంత పెద్ద భూకంపం గత తొంభై సంవత్సరాల్లో రాలేదు.

అణువిద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి ఆగిపోయింది. ఫలితంగా నగరంలో చాలా చోట్ల విద్యుత్ లేక పౌరులు ఇబ్బందులు పడుతున్నారు.

'సెందాయ్' నగరం అతలాకుతలం. ఎటు చూసినా శవాలే!

రవాణా వ్యవస్థలన్నీ ఛిన్నాభిన్నం.

అంతలో కరెంటు పోయింది. అదృష్టవశాత్తు ఎమర్జెన్సీ లైట్లు వెలిగాయి. టి.వి మళ్లీ పనిచేయసాగింది.

'ఫుకుషిమా' అణు రియాక్టర్లలో పేలుడు కారణంగా చాలా మంది కార్మికుల్ని బయటకు పంపేస్తున్నారు. ప్రస్తుతం అత్యవసర సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారు.

మూడు రియాక్టర్లలో అణు ఇంధనం పాక్షికంగా కరిగినట్లు అణు శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. దానివల్ల వాతావరణంలోకి అణు ధార్మికత విడుదల అవుతోంది. ఈ సమయంలో వర్షం కురిస్తే అది 'అణువర్షం' గా చర్మం మీద గాయాలు చేస్తుంది. కాన్సర్నీ కలిగించవచ్చు. కాబట్టి, ఎవరూ వర్షంలో తడవకూడదు. అణుధార్మికత వాతావరణంలో మరీ ఎక్కువగా కలిస్తే అది ఇతర ఆసియా దేశాలకు్కూడా ముప్పు కలిగించవచ్చు. అక్కడ కూడా అణు వర్షాలు కురవొచ్చు.

ప్రస్తుతం 'సెందాయ్' విమానాశ్రయం పూర్తిగా జలమయమైంది.

'ఇవానుమా' పట్టణంలో సముద్ర జలాలు బీభత్సం సృష్టిస్తున్నాయి.

అంతలో కరెంటు మళ్లీ వచ్చింది. ఎమర్జెన్సీ లైటు ఆరిపోయింది. టీవీలో సిగ్నల్ పోయింది.

గదిలో ఫాన్లు తిరుగుతున్నాయి. ఏసీ పనిచేస్తోంది.

"శ్యామల గారూ! ప్రత్యక్ష నరకం– స్వర్గం రెండూ ఈ గదిలోనే మనకు కనిపిస్తున్నాయి కదూ? ఒక్కటి మాత్రం నిజం. మనం ఇప్పట్లో ఫుకుషిమాకి వెళ్లం."

"అంత గట్టిగా ఎలా చెబుతున్నారు?"

"ఎలా వెళ్తాం? ఫుకుషిమానే ప్రమాదంలో పడింది. మనం వెళ్లాలంటే రవాణా వ్యవస్థ లేదు. అన్నట్టు మీ దగ్గర ఆహారం, మంచినీళ్లు సరిపడా ఉన్నాయా?"

"సరిపడా అంటే ఏం చెబుతాం? నాలుగైదు రోజులకు సరిపోతాయి"

"జాగ్రత్తగా వాడుకుంటే పది రోజులకు సరిపోవచ్చు..."

"అంటే అర్ధాకలితోనా?"

"అసలు లేని దానికన్నా సగం ఆకలి తీర్చేది నయం కదా?"

అంతలో 'సెల్‌ఫోను' మోగింది. నెంబరుతో పాటు కనిపిస్తున్న పేరు చూస్తూ "మన మెహతా... " అంటూ చెవి దగ్గర పెట్టుకుని హలో..." అన్నాడు పెద్దగా.

"ఎక్కడున్నారు, ఎలా ఉన్నారు?" మెహతా అడిగాడు.

"శ్యామల గారి అపార్టుమెంట్‌లో ఇంతవరకు క్షేమంగానే ఉన్నాం. ఇక ముందు తెలియదు. మీరు ఫుకుషిమా జోన్‌లోనే ఉన్నారుకదా.. దూరంగా వచ్చెయ్యకూడదూ?"

"లేదు జితేంద్రా! ఇంతకు మునుపే మన భారత రాయబార కార్యాలయం వారు గట్టిగా చెప్పారు. జపాను ప్రభుత్వం కూడా ఒత్తిడి చేస్తోంది. ఫుకుషిమా రియాక్టరు భద్రత అధికారిగా ఉంటూ, ఇలాంటి విపత్కర పరిస్థితిలో నా ప్రాణం కాపాడుకునేందుకు దూరంగా పారిపోవటం నా కర్తవ్యాన్ని, బాధ్యతను మరిచిపోవడమే అవుతుంది. అందువల్ల నేను, నా కుటుంబం ఇక్కడే ఉండదలచాం..."

"అణు ధార్మికత పెరిగిపోతే కనీసం ఇరవై కిలోమీటర్ల పరిధిలో అత్యంత ప్రమాదకర

పరిస్థితి ఏర్పడుతుంది కదా?"

"నాకు తెలుసు జితేంద్రా! నేను నీ కన్నా సీనియర్ సైంటిస్టుని కదా! పౌరుల్ని భద్రతా కారణాల వల్ల ఇరవై కిలోమీటర్ల వరకు ఇప్పటికే ఖాళీ చేయించాం. గొడుగు తాను తడవాలి తప్ప, తన కింద ఉన్నవాళ్ళని తడవనీయకూడదు. ఇప్పుడు నేను గొడుగు లాంటి వాడిని... జితేంద్రా! జపాను సమాధి మీద పెరిగిన పూలతోటలా అణు విస్ఫోటం నుంచి ప్రపంచం అబ్బురపడేలా అభివృద్ధి చెందింది. ఇప్పుడు మళ్లీ ఆపదలో చిక్కుకుంది. వేల సంఖ్యలో పౌరులు మరణిస్తున్నారు. మనం ఈ సమయంలో మానవత్వం చూపాలి. పిరికితనం, ప్రాణభయం కాదు..."

"మెహతా నవ్వాడు. దటీజ్ గుడ్ స్పిరిట్... అవసరం రావొచ్చు. సిద్ధంగా ఉండండి" అంటూ సెల్‌ఫోన్ కట్టేశాడు.

"అలాగన్నారేంటి? ఈ పరిస్థితిలో ఫుకుషిమా ఎలా వెళతాం?!" ఆశ్చర్యంగా అడిగింది శ్యామల.

"ఇది జపాను శ్యామల గారూ! మన అవసరం కలిగితే, ఈ బిల్డింగ్ నుంచి హెలికాప్టరులో తీసుకెళ్తారు.."

"నిజంగానా?!" శ్యామల ఆశ్చర్యంగా అడిగింది.

"నిజమైతే ఎంత థ్రిల్‌గా ఉంటుంది! మెహతా గారు చూడండి. ఒక పక్క అణుధార్మిక ప్రమాదం ఉన్నా, ఆయన తన కర్తవ్యం గురించే ఆలోచిస్తున్నాడు. తుపాకి పుచ్చుకొన్న వాడే సిపాయి కాదు. క్లిష్ట సమయంలో గుండె దిటవు కలవాడు కూడా సిపాయే. మెహతా అలాంటి వాడు. మా నాన్న అనేవారు... ఎన్నాళ్లు జీవించామని కాదు, ఎలా జీవించామన్నదే ముఖ్యమని..."

"జితేంద్రగారూ! ముందు ఆ చేతులు కడుక్కోండి. అన్నం ఎలాగూ నేలపాలయింది. కనీసం బ్రెడ్ తిందాం"

"అలాగే" అంటూ వాష్ బేసిన్ దగ్గరకెళ్లి పంపుతిప్పాడు. కాసిని నీళ్లు వచ్చి ఆగిపోయాయి.

"శ్యామల గారూ! నీళ్లు రావటంలా..." ఆందోళనగా అన్నాడు.

"బాత్రూమ్‌లో రెండు బకెట్లలో నీళ్లు పట్టిఉంచాను. అక్కడికెళ్లి కడుక్కోండి. కానీ, జాగ్రత్త. నీళ్లు పొదుపుగా వాడండి.."

"అలాగే" అంటూ బాత్‌రూమ్ వైపు వెళ్లాడు జిత్రేంద.

"ఇప్పటి వరకు సునామీ వల్ల పదివేల మందికి పైగా మరణించారు. ఒక్క మియామీలో ఆరువందల మృతదేహాలు లభించాయి. లక్షలమంది నిరాశ్రయులయ్యారు. వేలమంది రక్షణ శిబిరాల్లో తల దాచుకుంటున్నారు. ఫుకుషిమా దైచీ అణు విద్యుత్

ప్లాంట్‌లో మూడోనెంబరు రియాక్టరు కూడా ప్రమాదంలో ఉంది. శీతల వ్యవస్థలు కుప్పకూలాయి. హెలికాప్టర్ల ద్వారా సముద్ర జలాల్ని వెదజల్లుతున్నారు. భారత్‌తో సహా అనేక దేశాలు సహాయ సామాగ్రిని పంపుతున్నాయి. బాధితులకు కప్పుకొనేందుకు దుప్పట్లు కూడా లేవు. కట్టుబట్టలతో ప్రమాదంలోంచి బయటపడ్డారు. అణుధార్మికత స్థాయి పెరుగుతోంది. తాగునీటిలో, ఆహార పదార్థాల్లో, పాలల్లో కూడా అణు ధార్మికత కలిసిపోయింది. దయ చేసి నీటిని, ఆహార పదార్థాలను పరీక్ష చెయ్యకుండా తీసుకోకండి..."

టీవీ వార్తలు చూస్తున్న జితేంద్ర చివరగా చెప్పిన హెచ్చరికలు విని శ్యామల కేసి చూశాడు. ఇద్దరి చేతుల్లో 'చిప్స్' పాకెట్లున్నాయి.

'తినటమా, మానటమా' అన్న ప్రశ్న అతని చూపుల్లో కదలాడుతోంది.

"ఏమీ తినకపోతే ఎలా బతుకుతాం? కాబట్టి ఆ చచ్చేదేదో తినే చద్దాం" అంది శ్యామల నిస్సంకోచంగా చిప్ తింటూ. జితేంద్ర కూడా చిప్స్ తినసాగాడు.

"ఎంతలో ఎంత మార్పో చూడండి. మొన్నటి దాకా ఇది భూతల స్వర్గం. ఇవాళ మరుభూమి. తిండి తినాలన్నా, నీళ్లు తాగాలన్నా ప్రాణ భయం. నాగరికతలో సుఖం కన్నా దుఃఖం ఎక్కువగా ఉంది. మనదేశంలో విదేశీ అనుకరణ ఎక్కువ. మంచి బంగారం ఇచ్చి కాకి బంగారం కొనుక్కుంటుంటారు. మనకెన్నో సహజ వనరులున్నాయి. అణు విద్యుత్‌తో సంబంధం లేకుండా మనకున్న పుష్కలమైన జలవనరులతో విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు అయినా. ఎగబడి మరీ అణు విద్యుత్ కేంద్రాల్ని దేశంలో పలుచోట్ల నిర్మిస్తున్నారు. స్థానికుల ఆందోళన కూడా పట్టించుకోవటం లేదు.." అన్నాడు జితేంద్ర.

"చెర్నోబిల్ అణుప్రమాదం 1986 ఏప్రిల్ 26న జరిగినప్పుడే ప్రపంచం ఉలిక్కి పడింది. ఆ ప్రమాదం నుంచి పాఠాలేవీ నేర్చుకోలేకపోవటం వల్లనే అభివృద్ధి చెందుతున్న దేశాలే కాదు. బడుగు దేశాలు కూడా అణు రియాక్టర్లకి ఎగబడుతున్నాయి..." నిరసనగా అంది శ్యామల.

"అణు రియాక్టర్ల ప్రమాదంలో వెలువడే అణు ధార్మికత దుష్ప్రభావం కొన్ని శతాబ్దాల వరకు ఉంటుంది. కేన్సర్, లుకేమియా, జీర్ణకోశ వ్యాధులు తరతరాలకు వ్యాపిస్తాయి. పిల్లలు అనేక లోపాలతో పుడతారు. కంటి చూపు దెబ్బతింటుంది. వాతావరణం కలుషితమవుతుంది. పక్షులు, పశువులు తీవ్ర అనారోగ్యం పాలవుతాయి. పునరుత్పత్తి అవయవాలు దెబ్బతింటాయి. సూర్యకిరణాలు మృత్యుకిరణాలై చర్మ క్యాన్సర్‌కి కారణమవుతాయి..."

"ఇవన్నీ ప్రభుత్వాలు దృష్టిలో ఉంచుకోవాలి. ఏ పౌరులైనా తమ దేశ సంక్షేమం కోసమే ప్రభుత్వాలను ఎన్నుకుంటారు. ఆ ప్రభుత్వాలే తప్పుదారిన నడిస్తే దేవుడు కూడా

కాపాడలేదు..."

అంతలో సెల్‌ఫోను మోగింది.

"మళ్లీ మెహతా గారే ఫోను చేశారు..." అంటూ "చెప్పండి సార్" అన్నాడు జితేంద్ర.

"ఇక్కడ మీ అవసరం వచ్చింది. మీ కోసం హెలికాప్టరు వస్తోంది. మీరు మీ బిల్డింగ్‌పైకి వచ్చెయ్యండి..." అన్నాడు మెహతా.

"అలాగే సార్... ఇప్పుడే వస్తున్నాం..." అంటూ సెల్ కట్ చేసి "శ్యామల గారూ! పదండి...ఫుకుషిమాకి మన అవసరం వచ్చింది...." అన్నాడు.

"పదండి" అంది శ్యామల.

◆ ◆ ◆

"ఫ్రెండ్స్! సాధారణ ఉద్యోగులందర్నీ ఫుకుషిమా నుంచి బయటకు పంపేశాం. ఇప్పటికే కొందరికి రేడియేషన్ బాగా సోకింది. వాళ్లని ఆస్పత్రిలో చేర్చాం. ఇప్పుడు మనం ఫుకుషిమాని కాపాడుకోవాలి. రేడియో ధార్మికతని వెంటనే అదుపుచెయ్యాలి..."

మెహతా మాట్లాడటం ఆపి, తన ముందు ఉన్న యాభై మంది సైంటిస్టుల మోహాలు చూశాడు. రక్షించే దుస్తులు ధరించి ఉన్నారు. వారిలో జితేంద్ర, శ్యామల కూడా ఉన్నారు.

"మిత్రులారా! ఇప్పుడు మనందరం యుద్ధరంగంలో ఉన్నాం. మన సంకల్పమూ, సాహసమే మన ఆయుధాలు. అణు రియాక్టర్ల నుంచి రేడియేషన్ జరక్కుండా ఆపే ప్రయత్నంలో మనలో కొందరు మరణించవచ్చు. కానీ, అది వీరోచిత మరణం! ప్రపంచం, ముఖ్యంగా జపాను పౌరులు మనల్ని గుర్తుంచుకుంటారు. మన శవాలు సమాధుల్లో ఉన్నా మన పేర్లు చరిత్ర పుటల్లో ఉంటాయి. మీలో ఎవరికైనా ఇష్టం లేకపోతే ఇప్పుడే వెళ్ళిపోవచ్చు..."

అందరూ కుడిచెయ్యి గాలిలోకెత్తి "మేం మీతోనే ఉంటాం. ఫుకుషిమాని కాపాడతాం" అని నినదించారు. మెహతా సంతోషించాడు.

"ఇప్పుడు పరిస్థితి మీకు వివరిస్తాను. ఫుకుషిమా రియాక్టర్లలో శీతల వ్యవస్థ కీలకమైందని మీ అందరికీ తెలుసు. సునామీ, భూకంపాల వల్ల రియక్టర్లను నిలిపివేశాం. శీతల వ్యవస్థలు పనిచెయ్యాల్సి ఉంది. కానీ, నీటిని పంప్ చెయ్యటానికి విద్యుత్ ఉండి తీరాలి. ఐతే, ప్రస్తుతం విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది. నీటిని పంప్ చెయ్యకపోవటం వల్ల తీవ్రస్థాయిలో కోర్ ఉష్ణోగ్రత పెరిగిపోయింది. ఇంధనం కరిగిపోయి పాడవడం బాగా హెచ్చింది. దీని ఫలితంగా అణు ధార్మికత లీక్ అవుతోంది. అప్పటికీ పీడనాన్ని తగ్గించటానికి ఐదు రియాక్టర్ల నుంచి రేడియో ధార్మిక ఆవిరిని విడుదల చేశాం. అయినా ఒత్తిడి అదుపు కాక కోర్ భాగం చుట్టూ ఉన్న నిర్మాణం. గోడలు, పైకప్పు ధ్వంసమయ్యాయి. అయితే రియాక్టర్లు ఉంచిన లోహపు ఛాంబరు చెక్కు చెదరక పోవటం మనందరి అదృష్టం.

లేకపోతే, ఇప్పుడు ఇక్కడ ఈ సమావేశం జరిగేది కాదు. లక్షల సంఖ్యలో మిల్లీరెమ్స్ మేర రేడియేషన్‌ని తట్టుకునే శక్తి మన శరీరానికి ఉండదు. కానీ, దేన్నయినా ఎదుర్కోగల శక్తి మన సంకల్పానికి ఉంది కాబట్టి, ఇక మనం మన పని మొదలు పెడదాం. అందరూ నన్ను అనుసరిస్తూ నేను చెప్పినట్లు చెయ్యండి...” అంటూ మెహతా సమావేశం ముగించాడు.

◆ ◆ ◆

“తాజా వార్తలు

ఇంత వరకు మూడు తీర ప్రాంతాల్లో తొంభై శాతానికి పైగా ఇళ్లు సముద్రదాటికి కొట్టుకుపోయాయి. సెందాయ్ నగరంలో కార్లు, విమానాలు, నీళ్ళలో తేలడాన్ని మీరు ఈ చిత్రాల్లో చూడవచ్చు. యాబై అయిదు లక్షల మందికి విద్యుత్ సౌకర్యం నిలిచిపోయింది. రికుజెన్‌టకటా పట్టణంలో మూడువేల నాలుగు వందల భవనాలు దెబ్బతిన్నాయి. నాలుగు రైళ్ల ఆచూకీ తెలియటంలేదు. టోక్యోలో జనజీవనం స్తంభించిపోయింది. లక్షా ఇరవైవేల మంది, రైళ్లు రద్దు కావడంతో తమ ఆఫీసుల్లోనే ఉండిపోయారు. ఆరు లక్షల మందికి తాగునీరు లభించక అల్లాడుతున్నారు.

సముద్ర జలాల్లో కూడా అణు ధార్మికత చేరినట్లు శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

ప్రధాని నావొటెకన్ స్వయంగా సహాయచర్యల్ని పర్యవేక్షిస్తున్నారు సైన్యం ద్వారా మంచినీటిని, ఆహార పదార్థాల్ని ప్రజలకు పంపిణీ చేస్తున్నారు.

ఫుకుషిమా అణు రియాక్టరుని ప్రమాదం నుంచి కాపాడేందుకు ఒక శాస్త్రవేత్తల బృందం తీవ్రంగా కృషి చేస్తోంది. ఆ బృందంలో భారతీయ శాస్త్రజ్ఞులు కూడా కొందరు ఉన్నారు. త్వరలోనే ఫుకుషిమాను సురక్షితం చెయ్యగలమని శాస్త్రజ్ఞుల బృందం నాయకుడు డాక్టర్ మెహతా భరోసా ఇచ్చారు.

వార్తలు సమాప్తం.

◆ ◆ ◆

“జితేంద్ర గారూ! చివరికి ఫుకుషిమా ప్రమాదం నుంచి జపాన్ ప్రజల్ని కాపాడగలిగాం. మోహతా గారన్నట్లు మనందరం మృత్యుధూళి లాంటి అణు ధార్మికతతో కలిసికట్టుగా పోరాడాం. జయించాం.. ఎటొచ్చీ రేడియోధార్మిక ప్రమాదానికి గురయిన అయిదుగురిలో మనిద్దరమూ ఉండి ఇలా ఆస్పత్రి పాలయ్యాం..” అంది పేలవంగా నవ్వుతూ శ్యామ.

“అయిదు లక్షల మిల్లీ రెమ్స్ రేడియేషన్ ప్రభావానికి గురయ్యాక మనం ఆస్పత్రిపాలు కాకుండా ఎలా ఉంటాం? మీకో విషయం తెలుసా?”

“ఏమిటది?”

"మన గడియారాలు మూడునెలలలోపే ఆగిపోతాయి"

"గడియారాలు ఆగిపోవటం ఏమిటి?" అన్నది వెర్రిగా చూస్తూ.

"అదేనండీ! మన గుండె గడియారాలు... అర్థం కాలేదా? మనం బతికేది మూడునెలల వరకే, ఇది అణు రాక్షసి శాసనం..."

శ్యామల మౌనంగా ఉండిపోయింది.

"భయపడుతున్నారా? మెహతా గారు చెప్పినట్టు మనం భౌతికంగా చచ్చిపోయినా చరిత్రలో బతికుంటాం. నాదో చివరి కోరిక..."

"ఏమిటిది?!"

"ఇప్పటికైనా ఐ లవ్ యూ చెప్పరా! తృప్తిగా చచ్చిపోయి వచ్చే జన్మలో మీ లవర్‌గా పుడతాను.. ప్లీజ్.."

ఆమె హృదయం తల్లడిల్లి పోయింది. అతణ్ని హత్తుకుంటూ " ఐ లవ్ యూ ... ఐ లవ్ యూ... ఐ లవ్ యూ..." అంటూనే ఉంది కన్నీళ్ళతో.

దూరంగా ఉన్న ఫుకుషిమా రియాక్టర్ మెల్లగా మరణం నుంచి కోలుకుంటోంది. తిరిగి దేశ ప్రజలకు అణు విద్యుత్ అందించటానికి సిద్ధపడుతోంది. జపాన్‌లో మళ్లీ సమాధుల మీద పూల తోటలు కళ్లు తెరుస్తున్నాయి. సముద్రం ప్రశాంతంగా ఉండి, తీరానికి దూరంగా ఉంది.

కథా నిలయం
శ్రీకాకుళం